


# ఎర్రనూకరాజుగారి జంక్షన్





లారీ పెద్దగా శబ్దం చేస్తూ ఆగిపోయేసరికి వెనక పడుకున్న వాళ్లిద్దరూ ఉలిక్కిపడి లేచారు.

టైరు పేలిపోయిందట.

"ఎక్కడున్నాం మనం?" జాకీ మోసుకొస్తున్న క్లీనర్‌ని అడిగాడు బుచ్చిరెడ్డి.

దాసన్నపేట దాటేం కాస్త చిరాగ్గా చెప్పాడు క్లీనర్.

సామాన్లతో కిందికి దిగారు.

చుట్టూ చిట్టడివి మధ్యలో ఉన్న రోడ్డు మీంచి లారీలూ, బస్సులూ విసురుగా వస్తూ పోతున్నాయి. అది మెడ్రాస్‌నించి కలకత్తా వైపెళ్ళే ట్రంకు రోడ్డంట. వాళ్ళు నిలబడ్డ ఆ స్థలానికి అటు పాతికమైళ్ళు దాకా, ఇటు పాతికమైళ్ళు దాకా ఊరేలేదట. రోడ్డుకి ఎడం పక్కన వున్న పెద్ద వేపచెట్టు కింద వాళ్ళ సామాన్లు పెట్టి ఎర్రనూకరాజు దగ్గర కొచ్చిన బుచ్చిరెడ్డి, "లారీ కదుల్తుంది పద" అన్నాడు ఒగరుస్తూ.



''లారీని పోనీయ్యండి. మనం ఇక్కడే వుండిపోదాం'' అంది ఎర్రనూకరాజు.

''ఈ అడివి మధ్యలో మనమేం చేస్తాం?'' విస్తుపోతా అడిగాడు బుచ్చిరెడ్డి.

విరిచిన వేప్పుల్లొకటి అందించి, ముందు ముఖం కడిగేక మాటాడుకుందాం అని రాళ్ళ మధ్యున్న నెరల్లోంచొస్తున్న నీళ్ళ దగ్గర కూర్చుని పళ్ళు తోమి ముఖం కడుక్కుని పూటుగా నీళ్ళు తాగాక వేపచెట్టు వైపు చూపిస్తూ, ''నాకు వంటలు బాగా వచ్చుగదా. ఆ చెట్టుకింద ఓపాకేసి హోటేలు పెడదాం'' అంది నూకరాజు.

''ఈ అడివిలో యాపారం ఏం సాగుద్ది నూకరాజు?'' నమ్మకం లేనట్టన్నాడు బుచ్చిరెడ్డి.

''నాకెందుకో మంచి నమ్మకం'' అందామె.

* * *

మర్నాడు పొద్దున్నే అటుగా వెళ్తున్న లారీల వాళ్ళకి వేపచెట్టు కింద ఒక చిన్ని తాటాకు పాక దాని ముందు పందిరి, దాని గుంజకి చిన్న రేకు మీద సుద్దతో ఎర్రనూకరాజుగారి కాఫీ ఓటేలు అని రాసుంది.

లారీ డ్రైవరు రామదాసుకిగానీ అతని అసిస్టెంటు శీనుగాడిగ్గానీ తాగుడు అలవాటు లేదు. ఆ ఇద్దరూ బెజవాడ కాళేశ్వర్రావు మార్కెట్లో ఉండే లారీ ఓనరుకి నమ్మినబంట్లు. వాళ్ళ లారీ ఎప్పుడూ ఏక్సిడెంటు చెయ్యలేదు.

ఏ అలవాటు లేని ఆ ఇద్దరూ కడుపునిండా తింటారు. రుచికరమైన వంట దొరికితే అసలు వదిలిపెట్టరు.

ఆ పొద్దుటపూట వాళ్ళ జైవీరాంజనేయాలారీ సర్వీసు బండిని మంచులో నెమ్మదిగా నడుపుతున్నోళ్ళు చిట్టడివి మధ్యలో ఆ తాటాకు పాక జూసి అర్జంటుగా ఆపేసేరు లారీని.

''ఈ చిట్టడివిలో ఎప్పుడూ లేంది ఇదేంట్రా?'' అన్నాడు రామదాసు.

''ఇదేదో కొత్త ఓటేలు లాగుంది బాసూ'' అన్నాడు శీనుగాడు.

''దిగు రుచి చూద్దాం'' అని లారీ ఆపేడు.

ఆ ఇద్దర్నీ ''పెద్దన్నయ్యా చిన్నన్నయ్యా'' అని మనసారా పిల్చిన ఎర్రనూకరాజు ఆ అడివిలో కోసిన అడ్డాకులో వేడివేడి ఇడ్డెన్లూ, కొబ్బరికాయా మామిడికాయా ఎండు మిరపకాయలూ కలిపి చేసిన రుచికరమైన పచ్చడి వేసింది.

ముతక ఉప్పుడు బియ్యం నూక కలిపిన ఆ పెద్దపెద్ద ఇడ్లీలూ పచ్చడి మహారుచిగా ఉన్నాయి. ముందు నాలుగు ఇడ్డెన్లతో మొదలెట్టిన రామదాసూ, శీనూ మూడు రేకుల ఇడ్లీలు తిని ''అమ్మా చెల్లమ్మా..మా జన్మలో ఇంత రుచికరమైన ఇడ్లీలూ పచ్చడీ ఎప్పుడూ తిన్లేదమ్మా. నీ పేరేంటో తెల్దుగానీ నువ్వు నిజంగా కాశీ అన్నపూర్ణవి తల్లీ'' అని దీవించి లారీ ఎక్కిన ఆ ఇద్దరూ దారిలో ఎదురైన ప్రతిలారీ వాళ్ళకీ ఎర్రనూకరాజు ఇడ్లీల గురించి బండి ఆపి మరీ చెపుతా ''అదిగానీ తినకపోతే మీ పుట్టగ దండగరా'' అని చాటింపేస్తా టౌను దాకా పాకించుకుంటా పోయేరు.

చాలా తక్కువకాలంలోనే లారీల వాళ్ళకి, బస్సులవాళ్లకీ తెలిసిపోయింది ఎర్రనూకరాజు ఓటేల్లో రుచి గురించి.

లారీలూ, బస్సులూ ఆగడం మొదలెట్టినియ్యి.

దాంతో,

పెసరెట్లు, పుల్లట్లుకూడా వెయ్యడం మొదలెట్టింది ఎఱ్ఱనూకరాజు. ఇక వాటి రుచి మరిగిన వాళ్ళంతా తమ బళ్ళు అక్కడే ఆపడం మొదలెట్టారు.

శీతాకాలం. వెచ్చటిఎండ కాస్తున్నా పట్టపగలే చలిగా ఉంది.

కడుపునిండా తన బల్లమీద కునుకుతీసి లేచిన బుచ్చిరెడ్డికి స్ట్రాంగ్ లిప్టన్ టీలో మీగడేసిచ్చిన ఎఱ్ఱనూకరాజు ''ఒట్టి టిఫినీయేగాకండా వచ్చేవారం నించీ భోజనాలుకూడా పెడదారి ఏవంటారు?'' అంది.

'నేనూ అదే అనుకుంటున్నాను. అయితే నాకు ఇంకో అవిడియా కూడా వచ్చింది నూకాలూ'' అన్నాడు బుచ్చిరెడ్డి.

''ఏంటో?'' అంది ఎఱ్ఱనూకరాజు.

''మన హొటేల్ని జేర్చి చిన్న కిళ్ళీకొట్టు పెడదారి'' అన్నాడు.

''అయితే నాకింకో అవిడియా వచ్చింది'' ఎఱ్ఱనూకరాజు.

''ఏంటది?'' అన్నాడు బుచ్చిరెడ్డి.

''భోజనం హొటేలు డ్రైవరు రామదాసు అన్నయ్యతోనూ కిళ్ళీకొట్టు క్లీనరు శీనుగాడు అన్నయ్యతోనూ ఓపెన్ చేయిద్దారి... ఆళ్ళ బోణీ గొప్పది. భోజనం ఒటేలు పెట్టిన రోజునించీ ఆళ్ళు ఇక్కడ తిన్నా షోడా తాగి కిళ్ళీ కట్టించుకున్నా డబ్బులుచ్చుకోకూడదు మనం..ఏవంటారు?'' అంది.

''శభాసు నీనోటి మాటమీద అలాగే కానియ్యి'' అన్నాడు బుచ్చిరెడ్డి.

కొన్నాళ్ళకి ఎఱ్ఱనూకరాజు ఒటేలుకి ఎడాపెడా కొన్ని కొత్తపాకలు లేచినియ్యి. అక్కడ ఆగినబళ్ళవల్లనైతేనే, మరేవయితేనే, ఆ చిట్టడివంతా నరకబడి ఊరుగా మారి ఎఱ్ఱనూకరాజుగారి జంక్షన్ అనే పేరెల్లింది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

వాళ్ళకి ముగ్గురు మొగపిల్లలూ ఒక ఆడపిల్లా పుట్టేరు.

హొటేల్లోకి కావలిసిన నూనె, శనగపిండి ఇంకా మసాలా సామన్లన్నీ ఖరీదు చెయ్యడానికి టౌన్లో వున్న సలాదిబాబ్జీగారి హోల్‌సేల్ షాపుకి వారానికి ఓసారి వెళ్తుంటాడు బుచ్చిరెడ్డి.

ఆ వారం ఖరీదు చేసుకుని బస్సెక్కి వస్తుండగా ఏమైందో ఏంటో స్పీడుగా వెళ్తున్న బస్సులోనే ప్రాణాలు వదిలేసేడు బుచ్చిరెడ్డి.

అతని అకాల మరణానికి పుట్టాకా ఎప్పుడూ ఏడ్వనంత ఇదిగా ఏడ్చింది ఎఱ్ఱనూకరాజు.

* * *

రోజులు గడుస్తున్నాయి.

చవగ్గా వస్తుంటే హొటేల్ని జేర్చి ఉన్న ఇరవై ఎకరాలు చిట్టడివిని కొని, చెట్లూ, పుట్టలూ నరికించి బోర్లు వేయించి పంట భూమిగా

మార్చిన నూకరాజు పదిహేను ఎకరాల్లో వరి, తక్కిన అయిదెకరాల్లో అపరాలూ, కాయగూరలూ పండించడం మొదలెట్టింది.

హొటేల్లో పనులకి తను తనపిల్లలు తప్పా జీతం ఇచ్చి పనోళ్ళనెవర్నీ పెట్టుకోలేదు.

నాలుగు గేదెల్నీ కొంది. దాంతో సొంతపాడి.

అలాగే పొయ్యిలోకి కావాల్సిన పుల్లలూ చుట్టూ ఉన్న అడివిలోంచి మోసుకొచ్చే కొండోళ్ళు ఏబేరం అడక్కండా ఇంత అని రేటు గట్టి చెప్పకండా ఇచ్చేస్తున్నారు.

అంతా సొంతమే గనక ఏలాభం లేకండా ఒకమనిషి కడుపునిండా భోజనం చెయ్యాలంటే ఎంతవుతుందో లెక్కేస్తే ఆమె లెక్కల ప్రకారం నాలుగుముప్పాళా అని తేలింది. దానిమీద ప్రతిభోజనానికీ ఒక్క పావలా లాభం వేసుకుంది.

మర్నాటినించి ఫుల్‌మీల్స్ రేటు ఇంత, ప్లేటు ఇడ్లీకి ఇంత, పెసరెట్టింత, పుల్లట్లు ఇంత, గోలీషోడా రేటు అయిదుపైసలు మాత్రమే అని హొటేలు బయట బోర్డు పెట్టేసింది. ఆ రేట్లు చూసిన బస్సులవాళ్ళు, లారీల వాళ్ళు ఇంత చవకా మామూలు చవకగాదు కారు చవక అని సంబరపడ్డమే గాకండా ఎడాపెడా వున్న టౌన్లలో చాటేశారు.

దాంతో ఈరూట్లో వచ్చే ఏ బండివాడు టిఫిను, భోజనం టౌన్లో చెయ్యడం మానేసి సరాసరి ఇక్కడికి వచ్చేస్తున్నాడు. రుచికరమైన పదార్థాలను వాళ్ళంతా ఆబగా తింటుంటే కొసరి కొసరి వడ్డిస్తుంది ఎర్రనూకరాజు.

* * *

ఎదిగిన కొడుకులకి కూతురుకీ పెళ్ళిళ్ళు చేసింది.

ఒకరోజు ఆనప్పాదు దొడ్లో పందిరి మీది కెక్కిస్తున్న తల్లిని ఒకచోట కూర్చోపెట్టి "టౌన్లలో పావళా సరుకుని రూపాయిపావళాకి అమ్ముతుంటే ఇక్కడ నువ్వేంటి? కుదరదు... రేట్లు పెంచుదాం" అని గొడవ పడేసరికి ససేమిరా కుదరదని ఎదురు తిరిగింది ఎర్రనూకరాజు.

కోడళ్ళ సపోర్టు బాగా పెరగడంతో మరింత అల్లరి చెయ్యడం గొడవపడ్డం మొదలెట్టారు కొడుకులు.

నా ప్రాణం వున్నంత వరకూ ఏ రేట్లూ పెంచడం కుదరదని శపథం చేసిన ఎర్రనూకరాజు, కేష్ సొరుగు దగ్గర్నుంచి కదిలేది కాదు. కొడుకులూ కోడళ్ళూ గొడవ మాత్రం రోజురోజుకీ పెరిగిపోవడంతో ఒక రకమైన చెరమొదలైందా మనిషిలో.

దాంతో,

ఒకరకమైన మనేద.

డెంగతో మంచానపడ్డ ఆమెకి మలేరియా వచ్చి దాంట్లోంచి కామెర్లలోకి దింపింది.

కూతురుండే ఊళ్ళో వైద్యం బాగుంటుందని వెళ్ళింది.

మూడు నెలలపాటు అక్కడే వుండిపోవాల్సి వచ్చింది నూకరాజు.

ఇదే అదను చూసుకుని ఇటు హొటేల్లోనూ, కిళ్ళీకొట్టులోనూ రేట్లు అడ్డంగా పెంచేశారు కొడుకులు.

జబ్బు నయమైపోయి వచ్చిన ఎర్రనూకరాజు ఎప్పట్లాగే కేష్ సొరుగు దగ్గరకొచ్చి కూర్చుంది.

ఒక మనిషి భోజనం చేసి అయిదురూపాయలకి బదులు పదిహేను రూపాయలు ఇచ్చి వెళ్ళిపోతుంటే వెనక్కి పిల్చి అయిదు

రూపాయలు మినహా మిగిలిన డబ్బు ఇచ్చేసింది.

ఆశ్చర్యపోయిన ఆ మనిషి, ''ఇదేంటి భోజనం రేటు పద్దెనిమిది రూపాయలు కాదా మామ్మగారూ'' అన్నాడు.

''కాదు నాయనా అయిదురూపాయలు మాత్రమే'' అంది.

'నేనీ ప్రాంతానికి కొత్తగా వచ్చాను. రెండు నెలలనించి భోజనం చేస్తున్నాను. పదిహేను తీసుకుంటున్నారే మీ వాళ్ళు'' అన్నాడు.

అంతే,

ఓపిక తెచ్చుకుని జువ్వలాగ పైకి లేచిన ఎర్రనూకరాజు మూల పడున్న రబ్బరు ట్యూబు తీసుకుని ముగ్గురు కొడుకుల్నీ చిన్నప్పుడు బాదినట్టు బాది అలసిపోయి నేలమీద పడిపోయి, ''బగమంతుడు మనకి ఎన్నో ఇచ్చాడు. ఇస్తానే వున్నాడు. సగానికి సగం పెంచి యాపారం చేసి పాపం మూట గట్టుకొమ్మని ఎవరు చెప్పార్రా?'' అనరుస్తూ స్పృహ తప్పి పడిపోయింది.

స్పృహ వచ్చాక ఇదే తంతు ఇలాగే మాటాడ్డం, మూలగడం, సణగడం.

అలా మాటాడ్తూ మాటాడ్తూనే ఆరోజు రాత్రి ప్రాణాలు విడిచి పెట్టింది ఎర్రనూకరాజు.

ఆమె మరణవార్త విన్న ఎర్రనూకరాజుగారి జంక్షన్‌లో జనమంతా తండాలుతండాలుగా వచ్చారు.

వచ్చిపోయే లారీలన్నీ బారులు తీర్చి ఆపేసి కన్నతల్లిపోతే ఎలా ఏడుస్తారో అంతకంటే ఎక్కువగా గుండెలవిసేలా ఏడుస్తూ శ్మశానం దాకా సాగనంపారు. నేలతల్లి ఈనినట్టు పోగైన ఆ జనాన్ని చూసిన ఎర్రనూకరాజు కొడుకులు, ఇన్ని వేలమందికి దగ్గరయిన మా అమ్మ పుణ్యాత్మురాలు. మేమేగాని పోతే ఒక్కడూరాడు కాష్టాలదిబ్బకి. ఎక్కడో పసలపూడిలో పుట్టి ఈ మారుమూల కొచ్చి ఇంతమంది అభిమానాన్ని సంపాయించుకున్న మా అమ్మ ఎంతగొప్పది. ఆ మహాత్మురాలి పద్ధతిలోనే నడుపుతాం హొటేల్ని. ఆ దేవత పెట్టిన రేట్లకే అమ్ముతాం అమ్మకాలు అనుకున్నారు.

కానీ,

ఎర్రనూకరాజులాగా వ్యాపారం చెయ్యడం కుదురుతుందా వాళ్ళకి?

అంత అప్పనంగా అన్నం పెట్టడానికి మనసొప్పుతుందా అని???

చూడాలి రేపట్నుంచి వాళ్ళేం చేస్తారో.

* * *